క్లుప్తంగా

ఘనంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం అభిమానులు, కార్యకర్తల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి భారీ గజమాలతో ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, టీఆర్‌ఎస్ అధ్యక్షులు పరమేశ్వర్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



పూజలు చేస్తున్న నీలం మధు

జోగిపేట(అందోల్): నియోజవర్గంలోని పుల్కల్ మండలం కోడూరు గ్రామంలో నిర్మించనున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ ఆదివారం రూ.25 వేల విరాళం అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ తలారి కృష్ణ, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు సుభాష్‌చందర్, ఆలయ ధర్మకర్త తిరుపతిరెడ్డి, ఎర్రారం సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు, పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: హనుమాన్ జయంతి కరపత్రంను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు విరుపాక్ష గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎంపీ బీబీ పాటిల్



నూతన వధూవరులతో ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్(జహీరాబాద్): జహీరాబాద్‌లోని శెట్కర్ ఫంక్షన్‌హాల్‌లో గణేష్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ అధ్యక్షులు కిష్టారెడ్డి కుమారుడు అనిల్‌రెడ్డి వివాహానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ బీబీపాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు ఎండీ తన్వీర్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చిన మధుసూదన్‌రెడ్డి



బోరుమోటారును ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాలో వేసవి మూలంగా నీటి ఇబ్బంది తలెత్తడంతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి గ్రామస్తుల కోరిక మేరకు సొంత నిధులతో గ్రామంలో బోర్ వేయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచందర్, పరుశురాం, దిలీప్, రాజు, భాస్కరరావు, రామారావు, సాంబ, పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మల్లికార్జునస్వామి జాతరలో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటే కృష్ణయాదవ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మర్ ప్రభాకర్, సర్పంచ్ సురేందర్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ తండాలో ఆదివారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని టైలర్స్ కాలనీవైపు మంచినీటి పైప్‌లైన్ లీకేజీతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయంపై స్థానికులు స్థానిక మెట్రో వాటర్ వర్క్స్ ఏఈ అమీరుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. కొన్ని నెలలుగా పైప్‌లైన్ లీకేజీ అవుతుందని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు సాక్షికి వివరించారు. అమీన్‌పూర్ పట్టణంలోని టైలర్స్‌కాలనీ వెళ్లే దారిలో మోడీ కాలనీ ఎదురుగా ఉన్న పైప్‌లైన్ నుంచి మంచినీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ఏఈ అమీరుద్దీన్ వివరణ కోరగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రోడ్డుపై పారుతున్న తాగునీరు

కొనసాగుతున్న వేసవి శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారంలో డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో పిల్లలు ఉత్సాహంగా గడుపుతున్నారని డైరక్టర్ రవిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిబిరంలో ఆదివారం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా నాడ యోగా కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించామన్నారు. డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో పిల్లలందరికీ హెల్త్ చెకప్‌లు, జూనియర్ నాగార్జునతో పలు వినోద కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు.



వేసవి శిబిరంలో పిల్లలు

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

జహీరాబాద్: సంగారెడ్డిలో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న నిరుద్యోగ యువకుల మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జహీరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని నేటివరకూ అమలు చేయకపోవడం నిరుద్యోగ యువతకు మోసం చేయడమేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అడివన్న, శివ, సుదర్శన్‌రెడ్డి, ప్రణయ్, సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

బీఎస్పీ సభకు తరలిన నాయకులు



నారాయణఖేడ్: హైదరాబాద్‌కు తరలివెళ్తున్న బీఎస్పీ నాయకులు

జోగిపేట(అందోల్): బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ చేపట్టిన చలో భరోసా సభకు అందోల్ బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముప్పారం ప్రకాశం నాయకత్వంలో నాయకులు తరలి వెళ్లారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా వెళ్లారు.

నారాయణఖేడ్: బీఎస్పీ భరోసా సభకు నారాయణఖేడ్ నుంచి బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అలిగే జీవన్‌కుమార్, నాయకులు పండరి, తుకారాం తదితరులు తరలివెళ్లారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

సీఎస్‌సీ డిజిటల్ విలేజ్‌గా దానంపల్లి



సీఎస్‌సీ విలేజ్‌ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

జోగిపేట(అందోల్): సీఎస్‌సీ డిజిటల్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ విలేజ్‌గా ఎంపికైన అందోల్ మండల పరిధిలోని దానంపల్లి గ్రామాన్ని ఆదివారం ఎంపీపీ బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ విలేజ్ ద్వారా గ్రామస్తులకు అనేక రకాల కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ విద్య తదితర సేవలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ జిల్లా మేనేజర్ కిషన్ రాథోడ్, సర్పంచ్ పోచయ్య, ఉపసర్పంచ్ రాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రత్యేక పూజలు

జోగిపేట(అందోల్): పుల్కల్ మండలంలోని కోడూర్ గ్రామంలో పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపనలో ఆదివారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య పాల్గొని పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ నర్సింహా రెడ్డి వారిని సన్మానించారు.



పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ జగదీశ్వరచారి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని నాగ్‌ధర్‌కు చెందిన బోరంచ దావీదు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి భార్య శ్యామలకు ఓ ప్రైవేట్ బీమా సంస్థ ద్వారా మంజూరైన రూ.2,89,125 చెక్కును ఆదివారం నిజాంపేట్ సర్పంచ్ జగదీశ్వరచారి అందజేశారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని కోడూరులో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో ఆదివారం పోచమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి నీలం మధు తదితరులు పూజలు నిర్వహించారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్

రాయికోడ్(అందోల్): మండలంలోని జంమ్గి సర్పంచ్ విఠమ్మ కుమారుడు రమేష్ వివాహం ఆదివారం జరిగింది. ఈ వేడుకలకు జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అల్లాదుర్గం మాజీ ఎంపీపీ కాశీనాథ్, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోదరుడు చంటి ఉదయ్‌కిరణ్‌లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రైతులను ఆదుకోవాలి

పాపన్నపేట(మెదక్): పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం పాపన్నపేటలోని అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షాలకు పంటనష్టం వాటిల్లిన బాధిత రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పరిశీలనలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపీటీసీలు శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, అనీల్, యాదగిరి, విఠలాక్షప్ప, సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ మార్చ్ ఈ నెల 11వ తేదీ ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు నిరుద్యోగ మార్చ్ సందర్భంగా ముందస్తుగా రూట్ మ్యాప్‌ను పరిశీలించేందుకు ఆదివారం సంగారెడ్డి పట్టణంలో పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు కొండాపురం జగన్, హన్మంత్‌రెడ్డి, నర్సారెడ్డి, మురళీధర్‌రెడ్డి, రవిశంకర్, రవీందర్‌రెడ్డి, నల్ల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

13 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఝరాసంగం(జహీరాబాద్): పట్టణ పరిధిలోని రంజోల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి 15వరకు నిర్వహించనున్నట్లు దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 108వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, రంజోల్ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్యస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న పీఠాధిపతులు, భక్తులు

మహార్యాలీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని నాగులకట్ట అనుభవ మంటపంలో లింగాయత్ మహార్యాలీ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లింగాయత్‌లను ప్రత్యేక ధర్మంగా గుర్తించాలని కోరుతూ జూన్ 4న హైదరాబాద్‌లో మహార్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి లింగాయత్‌లు అధికసంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

ఘనంగా నగర సంకీర్తన

జహీరాబాద్: పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు చేస్తూ శ్రీకృష్ణ భగవానుడిని స్మరిస్తూ పాటలు పాడారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.




భజన చేస్తున్న భక్తులు

సంక్షిప్త వార్తలు

◆ **ఖేడ్‌లో వాహనాల మళ్లింపు**

నారాయణఖేడ్: పట్టణంలో రాజీవ్‌చౌక్ నుంచి మంగల్‌పేట్ బస్టాండ్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా ఆదివారం రాత్రి నుంచి రోడ్డుకు మరో పక్క నుంచి సీసీతో విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో సోమవారం నుంచి పట్టణంలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాల రాకపోకలను మళ్లించనున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **ఘనంగా గురుదత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ**



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని పర్సపల్లి గ్రామంలో ఆదివారం గురుదత్తాత్రేయ విగ్రహాన్ని ఉదయ్‌కిరణ్ అవధాని (శ్రీశైలం దేవస్థానం) వారి ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు.

◆ **ఎమ్మెల్యే సాయం మరువలేనిది**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో అనేక సంవత్సరాలుగా ఉన్న దళితుల భూముల సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాసనూరి చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలిమెలలో అనేక సంవత్సరాలుగా దళితులు తమ భూములకు సంబంధించిన పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఒప్పించి వారికి పట్టా పాస్‌పుస్తకాలు ఇప్పించడం హర్షనీయని తెలిపారు.

◆ **కొనసాగుతున్న వేసవి శిబిరం**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం కొనసాగుతున్నాయి. వరదాచార్యులు పర్యవేక్షణలో పిల్లలకు ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన కలిప్తూ భగవద్గీత, శోక్లాలు నేర్పిస్తున్నారు. ఈ నెల14వ తేదీ వరకు వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ **8వ వార్షికోత్సవం**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని భరోసా కేంద్రంలో ఆదివారం 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సుమంగళ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన వధువరులకు ఆశీర్వాదం**



వధువరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీటీసీ

మునిపల్లి(అందోల్): నూతన వధువరులను జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ ఆశీర్వదించారు. ఆదివారం మండలంలోని ఖమ్మంపల్లి, బుదేరా గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహించిన పలు శుభకార్యాలకు జెడ్పీటీసీ హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంబదాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష**

నర్సాపూర్: గిరిజన గురుకులంలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య చెప్పారు. ప్రభుత్వం తమ పాఠశాలలో చేరేందుకు ఆదివారం పరీక్ష నిర్వహించగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి 349 మంది విద్యార్థులకు 131మంది హాజరైనారని ఆయన తెలిపారు. గురుకుల అధికారి కోటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రవేశ పరీక్ష చేపట్టామని వివరించారు.

◆ **ధాన్యం త్వరగా కొనుగోలు చేయడం లేదు**

చేగుంట(తూప్రాన్): అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యం త్వరగా తీసుకోవడం లేదని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడియారం గ్రామంలో ఆత్మగౌరవ యాత్ర నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళా రైతులతో మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. రైతుల ధాన్యం త్వరగా తీసుకోకుంటే రైతుల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను అములు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్, వడ్ల నవీన్, స్టాలిన్, వెంకటేశం, అన్నం అంజనేయులుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న దీక్షలు**

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు ఆదివారం నాటికి 42 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు యువజన, కుల సంఘాల, వ్యాపార వర్గాల వారు, పలు పార్టీల నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ మంజూరు చేసేవరకు విశ్రమించమని, ఆందోళన ఉధృతం చేస్తామని అఖిలపక్ష నేతలు ప్రకటించారు.

◆ **కనుల పండువగా వీరభద్రుడి కల్యాణం**

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రకాళీ సమేత వీరభద్రుడికి ఉదయం అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఏడుపాయల ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్ తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను, ఎదుర్కోళ్లను జరిపి స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఉత్సవాల్లో మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఆయన కూతురు త్రిష పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంచింతకుంట గ్రామానికి చెందిన నర్సింలు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవంలో పాల్గొనడంతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు వీరన్నస్వామి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం వేళలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.